31న ఉమ్మడి పశ్చిమ జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, స్థాయీ కమిటీ సమావేశం ఈ నెల 31న నిర్వహిస్తున్నట్లు జెడ్‌పి సిఇఒ కెవిఎస్‌ఆర్.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం రెండు గంటలకు జెడ్‌పి సమావేశ మందిరంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందన్నారు. జెడ్‌పి పరిపాలనకు సంబంధించిన ఎజెండా అంశాల ఆమోదం, 2023-24 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదం, ఇతర అంశాలపై సమీక్ష జరుగుతుందని తెలిపారు. తొలుత ఉదయం తొమ్మిది గంటల నుంచి జిల్లాపరిషత్ స్థాయి కమిటీ సమావేశాలు జరుగుతాయన్నారు.

12,737 పింఛన్లు రద్దు..!

రెండు జిల్లాల్లో తీవ్ర ఆందోళనలో లబ్ధిదారులు
అధికారుల చుట్టూ తిరుగుతున్నా సమాధానం కరువు
ప్రత్యేక రేషన్‌కార్డులున్నా.. పాత కార్డుల ఆధారంగా నోటీసులు
15 రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో వెల్లడి
హౌస్‌హోల్డ్ సర్వేలో డిలీట్ ఆప్షన్ ఇవ్వని ప్రభుత్వం
సమస్య పరిష్కారం ఎలాగని ప్రశ్నిస్తున్న బాధితులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఏలూరుకు చెందిన కె.రాజేష్ వికలాంగుడు. గత పదేళ్లుగా పింఛన్ తీసుకుంటున్నారు. వివాహమైన తర్వాత వారికి ప్రత్యేక రేషన్‌కార్డు సైతం వచ్చింది. రాజేష్ తమ్ముడు నాలుగు చక్రాల వాహనం కొనుగోలు చేశాడని రాజేష్‌కు పింఛన్ నిలుపుదల చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. అదేమని అడిగితే మీ ఆధార్ నెంబర్ పాత రేషన్‌కార్డుకు అనుసంధానమై ఉందని, అందువల్ల పెన్షన్ ఆగిపోయినట్లు చెబుతున్నారు. పాత రేషన్ కార్డుతో లింకు తొలగించే ఆప్షన్‌ను ప్రభుత్వం నిలిపివేసిందని, తాము ఏమీ చేయలేమని అధికారులు చేతులెత్తేశారు.'

రాజేష్ ఒక్కడే కాదు. రెండు జిల్లాల్లో పింఛన్ నిలిపివేస్తున్నట్లు నోటీసులు జారీ చేసిన 12,737 పింఛన్‌దారుల పరిస్థితి ఇదేవిధంగా ఉంది. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పింఛన్‌దారుల్లో తీవ్ర అలజడి రేపుతోంది. అన్ని రకాల అర్హతలున్నా పింఛన్లు రద్దు చేయడం ఏమిటని అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా సమాధానం చెప్పేవారే లేకుండాపోయారు. ఏలూరు జిల్లాలో 2.18 లక్షల పింఛన్లు, పశ్చిమగోదావరి జిల్లాలో 2,65,813 పింఛన్లు ఇస్తున్నారు. వీరిందరినీ ఎన్నో వడపోతల తర్వాత అర్హులుగా ఎంపిక చేశారు. ఇప్పుడు ఆకస్మాత్తుగా పింఛన్లు రద్దు చేస్తున్నట్లు నోటీసులు జారీ చేశారు. మీ కుటుంబ వివరాలను పరిశీలించాక జిఒ నెం.174 ప్రకారం కింది కారణాల వల్ల మీకు పింఛన్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు నోటీసుల్లో పేర్కొన్నారు. నోటీసుల్లో పేర్కొన్న కారణాల్లో అత్యధికం 300 యూనిట్లు దాటినట్లు విద్యుత్ బిల్లు, నాలుగుచక్రాల వాహనాలు, ప్రభుత్వ ఉద్యోగం ఉన్నట్లు పేర్కొన్నారు. వాస్తవానికి అధికారులు పేర్కొన్న కారణాలు ఏవీ వారికి వర్తించడం లేదు. అధికారులు నోటీసులు జారీ చేసిన పింఛన్‌దారులంతా పూర్తి అర్హత కలిగి ఉన్నారు. అధికారులు చూపిన కారణాలు అత్యంత దారుణంగా ఉన్నాయని చెప్పొచ్చు. హౌస్‌మేపింగ్‌లో డిలీట్ ఆప్షన్ తీసేసి, 15 రోజుల్లో సమాధానం ఇవ్వాలంటే నోటీసులిచ్చిన పింఛన్‌దారులు ఏవిధంగా ఇస్తారో అధికారులు సమాధానం చెప్పాలి. జనవరిలో కొత్త పింఛన్లు మంజూరు చేయాల్సి ఉంది. పింఛన్ల సంఖ్య పెరగకుండా రకరకాల కారణాలు చూపి ఉన్న పింఛన్లను తొలగిస్తున్నారని విమర్శలు విన్పిస్తున్నాయి. కుమారులకు కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటితే ప్రత్యేక రేషన్‌కార్డు ఉన్నప్పటికీ తల్లిదండ్రులకు సంబంధించిన పింఛన్ ఆపేయడం, తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం, అన్నకు ప్రత్యేక రేషన్‌కార్డు ఉన్నా పింఛన్ నిలిపివేయడం, కుటుంబ సభ్యుల్లో వేరొకరు నాలుగు చక్రాల వాహనం కొనుగోలు చేస్తే రేషన్‌కార్డులు ప్రత్యేకంగా ఉన్నా పింఛన్ ఆపేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. టిడిపి ప్రభుత్వంలో ప్రజాసాధికారిత సర్వేలో కుటుంబ సభ్యులందరినీ కలిపి హౌస్‌హోల్డ్ మేపింగ్ చేశారు. ఇది జరిగి ఎనిమిదేళ్లు దాటిపోయింది. హౌస్‌హోల్డ్ మేపింగ్‌లో డిలీట్ ఆప్షన్ ఇవ్వకుండా పింఛన్లను ఆపేస్తున్నారు.


తేది : 21/12/2022
105474145
AP37DP9929
(THIS NOTICE SYSTEM GENERATED.SIGNATURE NOT REQUIRED)

పింఛను లబ్ధిదారులకు జారీ చేసిన నోటీసు

ఆధారాలు ఇచ్చినా ప్రయోజనం శూన్యం

నాలుగు చక్రాల వాహనాలు ఉన్నట్లు నోటీసులు ఇవ్వడంతో రవాణాశాఖ కార్యాలయం నుంచి వాహనం లేనట్లు లేఖ తెచ్చి బాధితులు అధికారులకు ఇస్తున్నారు. విద్యుత్ బిల్లు 300 దాటలేదని వివరాలతో విద్యుత్‌శాఖ నుంచి లేఖ తెచ్చినా, భూములు లేవని రెవెన్యూ అధికారుల నుంచి ఆధారాలు తెచ్చి అధికారులకిచ్చినా పింఛన్ పునరుద్ధరణ జరగడం లేదు. అందుకు కారణం హౌస్‌హోల్డ్ సర్వేలో డిలీట్ ఆప్షన్ ఇవ్వకపోడమే. అసలు విషయాన్ని పక్కనపెట్టి 15 రోజుల్లో అర్హత నిరూపించుకోవాలని అధికారులు కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. నోటీసులిచ్చిన పింఛన్లు అన్నీ ఇదేతీరుగా ఉన్నాయి. వెంటనే హౌస్‌హోల్డ్ సర్వేకు సంబంధించి డిలీట్ ఆప్షన్ ఇచ్చి సమస్యను పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు. ఇప్పటికైనా కల్లబొల్లి మాటలు ఆపి పింఛన్ నిలిపివేస్తూ ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

పింఛన్ నిలిపివేస్తే పోరాటమే
అల్లాడి నటరాజు, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు

వికలాంగులకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించకపోవడంతో పెన్షన్ ఇస్తున్నారు. పెన్షన్ ఇవ్వడం ప్రభుత్వ కనీస బాధ్యత. వికలాంగులకు సమాన భాగస్వామ్యం ఇవ్వాలని చట్టం చెబుతోంది. చట్టాలను పక్కన పెట్టి వికలాంగుల పెన్షన్‌లు తొలగిస్తున్నారు. ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకుని పెన్షన్లను కొనసాగించాలి. లేకపోతే వికలాంగులంతా ఐక్యంగా పోరాటానికి దిగుతాం.

పింఛన్లు, రేషన్ కార్డుల కోత అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

నిబంధనల పేరుతో వృద్ధుల, వికలాంగుల, వితంతువుల పింఛన్లు, పేద, మధ్య తరగతి కుటుంబాల రేషన్ కార్డుల రద్దుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం అన్యాయమని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. ఈ మేరకు సిపిఎం ఏలూరు జిల్లా కమిటీ తరపున ఎ.రవి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరెంట్ 300 యూనిట్లు పైబడి వినియోగించారని, నాలుగు చక్రాల వాహనాలున్నాయని (అవి కిరాయికి తిప్పేవైనా), వెయ్యి చదరపు అడుగుల ఇంటి స్థలం ఉందని తదితర నిబంధనల పేరుతో పింఛన్లు, రేషన్ కార్డులు తొలగించడం సరికాదన్నారు. ఈ మేరకు లబ్ధిదారులకు సచివాలయాల ద్వారా ఐదు నుండి 30 మందికిపైగా నోటీసులిచ్చారన్నారు. జిల్లాలో 6500 మందికిపైగా తొలగించేందుకు రంగం సిద్ధం చేశారన్నారు. ఓ వైపు పింఛను నెలకు రూ.2500 నుండి రూ.2750కు పెంచి మరోపక్క లబ్ధిదారులను కుదించడం అన్యాయమన్నారు. ఉమ్మడి ఇళ్లు, విద్యుత్ కనెక్షన్లు ఉన్నప్పుడు ఇళ్లు, విద్యుత్ వినియోగం వంటివి చూసి పింఛన్లను రద్దు చేయడం సరికాదన్నారు. ఫలితంగా అర్హులు అన్యాయమవుతారన్నారు. తక్షణం నోటీసులు ఉపసంహరించుకోవాలని కోరారు. పింఛన్లు, రేషన్ కార్డులు కొనసాగించాలని, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి పింఛన్లు, కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - నిడమర్రు

వచ్చేనెల 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహాసభ వాల్‌పోస్టర్లను స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ మహాసభ తొలిరోజు జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంచ వరప్రసాద్, టి.వెంకటేశ్వరరావు, ఎస్.రాంబాబు, బి.సుజాత, వి.సుబ్బారావు. కె.వెంకటరత్నం పాల్గొన్నారు.

కామవరపుకోటలో..

కామవరపుకోట : సిఐటియు రాష్ట్ర 16వ మహాసభను జయప్రదం చేయాలని కెవిపిఎస్ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు. సోమవారం కామవరపుకోట మండల కేంద్రంలో సిఐటియు 16వ రాష్ట్ర మహాసభ కరపత్రాలను పంపిణీ చేశారు అలాగే ఆటో కార్మికులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగాఫ్రాన్సిస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలన్నారు. కార్మిక సమస్యలపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెంచిన డీజిల్ రేటు తగ్గించి ఆటో కార్మికులకు ఇళ్ల స్థలాలు, కాలనీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్‌కు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్స్, మధ్యాహ్న భోజనకార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, విఆర్‌ఎ, విఆర్‌ఒ, 104, 108 ఉద్యోగుల, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు కె.లక్ష్మణరావు, వెంకటేశ్వరావు, శ్రీనివాస్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రత్నకుమారి, శిరీష రాణి పాల్గొన్నారు.

కలిదిండి : సిఐటియు రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ కలిదిండి పంచాయతీ కార్యాలయం వద్ద ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. బహిరంగ సభకు కార్మికులందరూ తరలివచ్చేలా సిఐటియు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సిఐటియు మండల కార్యదర్శి చిన్నం శ్రీకాంత్ కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు యలవర్తి రమేష్, నాని, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు గూట్ల జయరాజు, శీలబోయిన సుబ్రహ్మణ్యం, కాలువ శ్రీను, షేక్ ఖాసింబాబు, జి.రంగారావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పరసా రాజేష్, పోతురాజు బాలాజీ, కటికల శ్రీను, షేక్ అక్బర్ పాల్గొన్నారు.

కలిదిండిలో..

పారదర్శకంగా భూముల రీసర్వే

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే పూర్తి పారదర్శతతో చేపడుతున్నామని, ఏమైనా సమస్యలుంటే వాటిని నివృత్తి చేసుకునేందుకు డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేశామని సర్వే, భూ రికార్డుల శాఖ సహాయ సంచాలకులు టి.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రీ సర్వే ప్రయోగాత్మకంగా ఏలూరు జిల్లాలో పది గ్రామాల్లో తొలిగా నిర్వహించామని, తదుపరి 71 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశామని తెలిపారు. రీ సర్వే మొదలు పెట్టినప్పుడు ఆ గ్రామపంచాయతీలో ప్రచురించి రైతులందరికీ అన్ని రకాల ప్రసార సాధనాల ద్వారా తెలియజేసి రైతులకు నోటీసులిచ్చి సర్వే చేశామని తెలిపారు. సర్వేలో నమోదు చేసిన కమతాలకు సరిహద్దు రాళ్లు వేసే పని ప్రగతిలో ఉందన్నారు. సర్వే చట్ట ప్రకారం భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కొన్ని సందర్భాల్లో సాంకేతిక కారణాల వల్ల గానీ, మానవ తప్పిదం వల్ల గానీ కొలతలు, విస్తీర్ణం, హక్కు ధృవీకరణ సమస్యలు గానీ తేడాలు వచ్చినట్లు భావిస్తే రీసర్వే సిబ్బందిని సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు. రాష్ట్ర ప్రభుత్వ భూ పరిపాలన శాఖ, సర్వే శాఖ వారిచే ఇప్పటికే సమగ్ర ఉత్తర్వులు ఇచ్చామన్నారు. అదేవిధంగా డివిజన్, జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేశామని, పూర్తి పారదర్శకంగా జరుగుతున్న భూముల రీ సర్వేకు సహకరించాలని కోరారు.

అరాచక శక్తులపై ఉక్కుపాదం మోపాలి

నేర సమీక్షలో జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ శర్మ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజలు మెచ్చేలా.. నేరస్తులు భయపడేలా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులకు జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశించారు. ఏలూరు పోలీసు ప్రధాన కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్, కైకలూరు సర్కిల్ పోలీస్ స్టేషన్ల పోలీస్ అధికారులతో సమీక్షించారు. సమన్వయంతో విధులు నిర్వర్తించాలన్నారు. నేర నియంత్రణకు, అక్రమ రవాణా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. విజిబుల్ పోలీసింగే ప్రధాన ఆయుధమన్నారు. కేసు దర్యాప్తు అంశాల్లో, విధి నిర్వహణలో అలసత్వం వహించే అధికారులు తమ తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. మారుతున్న చట్టాలు, కోర్టు కేసుల గురించి తెలుసుకోవాలని సూచించారు. నాటు సారా, గంజాయి, గుట్కా, ఖైనీ వంటి డ్రగ్స్ నియంత్రణలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహిస్తూ రాత్రిసమయంలో వాహనదారులకు ఫేస్ వాష్ డ్రైవ్‌ను నిర్వహిస్తూ రహదారి ప్రమాదాల నివారణకు రోడ్ సేఫ్టీ మొబైల్స్ సిబ్బంది పర్యవేక్షణ చేయాలన్నారు. పండుగలు నేపథ్యంలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పేకాట, కోడి పందేలను అడ్డుకునేందుకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. దొంగతనాల నియంత్రణకు ఎల్‌హెచ్‌ఎంఎస్ వినియోగంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, తరచూ చోరీలు జరిగే ప్రాంతాల్లో రాత్రి, పగలు బీట్‌ను బలోపేతం చేయాలని, రక్షక్, బ్లూ కోల్ట్ వాహనాలు నిరంతరం పెట్రోలింగ్ చేయాలని ఆదేశించారు. మహిళల ఫిర్యాదులపై తక్షణం స్పందించి సకాలంలో న్యాయం చేయాలన్నారు. 'దిశ' యాప్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. మిస్సింగ్ కేసుల పరిష్కారం కోసం సమగ్రమైన నివేదికను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

త్రోబాల్ పోటీల్లో విఆర్ కళాశాల విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - ముదినేపల్లి

అండర్ -19 బాలికల త్రోబాల్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థిని జిల్లా ద్వితీయ స్థానం సాధించినట్లు స్థానిక విఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జెవి.రమణ సోమవారం తెలిపారు. ఈ నెల 22, 23, తేదీల్లో వైజాగ్ దువ్వాడ అంబేద్కర్ కళాశాలలో జరిగిన త్రోబాల్ ఆటల పోటీల్లో ముదినేపల్లి విఆర్ జూనియర్ కళాశాల ఎంపిసి విద్యార్థిని, మండలంలోని గురజ గ్రామానికి చెందిన ఆకుల మౌనిక జిల్లాస్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్‌తో పాటు ఆధ్యాపకులు, సిబ్బంది మౌనికను అభినందించారు.

గుండెపోటుతో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గుండె పోటుతో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మృతిచెందిన ఘటన జీలుగుమిల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఉపాధి హామీ చట్టంలో జీలుగుమిల్లి టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.శ్రీనివాస్(48) ఎప్పటిలానే విధులకు బయలుదేరుతుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. బంధువులు, స్థానికులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందారని వైద్యులు తెలిపారు. ఆయన మృతితో ఉపాధి హామీ సిబ్బంది తీవ్రదిగ్భ్రాంతికి గురయ్యారు. ఎంపిడిఒ మంగతాయారు, ఎపిఒ జాన్ వెస్లీ, ఉపాధి హామీ సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. గతంలో దేవరపల్లిలో పనిచేసి జీలుగుమిల్లికి వచ్చినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. అనంతరం మృతదేహాన్ని తాళ్లపూడిలోని ఆయన స్వగృహానికి తరలించారు.

శ్రీనివాస్ (ఫైల్‌ఫొటో)

నల్ల రిబ్బన్లతో 108 సిబ్బంది నిరసన

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వం తమను గుర్తించాలంటూ కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి అత్యవసర వైద్య సేవలందించిన 108 సర్వీస్ సిబ్బంది నల్ల రిబ్బన్లతో సోమవారం నిరసన తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగిగా గుర్తిస్తామని గతంలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎఐఎంఎస్ సంస్థ వచ్చిన తర్వాత చిన్నచిన్న కారణాలకు కూడా అనేక మందిని ఉద్యోగం నుండి తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 14 తేదీన ఎఐఎంఎస్ యాజమాన్యానికి, వైద్య ఆరోగ్యశాఖలోని ఉన్నతాధికారులకు సమ్మె నోటీసు అందించామన్నారు. వచ్చేనెల 15వ తేదీలోపు సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో సమ్మెకు వెళతామని ఉద్యోగులు హెచ్చరించారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని, తొలగించిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ 'బేస్ లొకేషన్'లో వాహనం ముందు డ్యూటీ ఎక్కి, దిగే ప్రతి ఉద్యోగి ప్లకార్డులు పట్టుకుని వాహనం ముందు మోకాళ్లపై నిలబడి ఫొటో దిగి ఆ ఫొటో, లెటర్‌ను మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీకి మెయిల్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల 108 సిబ్బంది అనిల్ కుమార్, రామారావు పాల్గొన్నారు.

ముసునూరు ఎంపిడిఒగా రాణి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు ఎంపిడిఒగా జి.రాణిగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూజివీడు ఎంపిడిఒగా పనిచేసిన రాణి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన ఇఒపిఆర్‌డి అత్యుత సత్యనారాయణ యథాస్థానానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సిఎం జగన్ ప్రవేశపెట్టిన నవరత్నాల లబ్ధిని అర్హులందరికీ అందేలా చూడాలన్నారు. ఆయుష్మాన్‌భవన పథకంపై క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎఒ కూచిపూడి సాయిరామ్ పాల్గొన్నారు.



బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ రాణి

ఎగసిన అగ్ని కీలలు..!

ఈ ఏడాది భారీగా పెరిగిన అగ్నిప్రమాదాలు
అనుమతుల్లేని ఫ్యాక్టరీలపై చర్యలు శూన్యం
ప్రమాదం జరిగితే గానీ స్పందించరా?

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పచ్చని పశ్చిమగోదావరి గడచిన మూడేళ్ల కాలంలో అగ్నికీలల్లో చిక్కుకున్నట్లయింది.. ఎటు చూసినా పచ్చదనంతో కనిపించే పశ్చిమగోదావరి జిల్లాలో మునుపెన్నడూ లేనివిధమైన భారీ అగ్నిప్రమాదాలు చోటు చేసుకోవడం జిల్లావాసులను కలవరపాటుకు గురిచేసింది. దీనికితోడు ఎంతోమంది మృత్యువాత పడటం అగ్నిమాపకశాఖలోని డొల్లతనాన్ని కూడా బయటపెట్టింది. కరోనా ఆరంభమైన తర్వాత అడపాదడపా అక్కడక్కడ చిన్నపాటి ప్రమాదాలు జరిగినా ఇటీవల కాలంలో తాడేపల్లిగూడెం రూరల్ మండలం కడియద్ద గ్రామంలో బాణసంచా తయారీ కేంద్రంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలవడం అందరినీ కలవరపాటుకు గురిచేసింది. దాంతో పాటుగా పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు సమీపంలోని ఫుడ్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. పశ్చిగోదావరి జిల్లా చింతలపూడి పట్టణంలో పెట్రోల్ బంక్ పక్కన గల కాంప్లెక్స్‌లో గోపాలకష్ణ ఆటోమొబైల్ షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. పెట్రోల్ బంక్ పక్కన ఉండటంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. షాపులోని గల స్పేర్ పార్ట్‌లు కాలిపోయాయి. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఇలా చూసుకుంటూ పోతే చిన్నాచితక ప్రమాదాలు సంఖ్య అయితే చెప్పనవసరం లేదు. ఏలూరు నగరంలోనే ఓ ఎలక్ట్రిక్ బైక్‌ల దుకాణంలో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో అనేక వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. వీటన్నింటినీ పరిశీలిస్తే అగ్నిమాపకశాఖ అధికారులు పర్యవేక్షణా లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

నిబంధనలు పాతర..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 120 పైచిలుకు ఫ్యాక్టరీలున్నట్లు అగ్నిమాపకశాఖ అధికారుల వద్ద సమాచారం ఉంది. వీటికితోడు మరికొన్ని అనుమతుల్లేని ఫ్యాక్టరీలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా ఈ ఫ్యాక్టరీల్లో ఎక్కువగా తణుకు ప్రాంతంలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలతో రిసైక్లింగ్ చేసే ఫ్యాక్టరీలు నడుస్తున్నాయి. అందులో పనిచేసే కార్మికులకు కనీస భద్రత కూడా ఉండడం లేదు. ఎక్కువశాతం బీహార్, ఒడిషా వంటి ప్రాంతాలకు చెందిన కార్మికులను ఈ ఫ్యాక్టరీల్లో కార్మికులుగా పెట్టుకుంటున్నారు. హైదరాబాద్‌లో ఈ తరహా ఫ్యాక్టరీల్లో అగ్నిప్రమాదం చోటు చేసుకుంటే సుమారు 17 మంది వరకూ ప్రాణాలు కోల్పోయారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అలాంటిది జరగలేదు కానీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీల్లోనూ సుమారు 80 వరకు మాత్రమే అగ్నిమాపకశాఖ దగ్గర తిరిగి తమ అనుమతులను రెన్యూవల్ చేసుకోగా, మిగిలిన ఫ్యాక్టరీలు రెన్యూవల్ చేసుకోకుండా నడుస్తున్నట్లు సమాచారం. వీటితో పాటుగా జిల్లాలో చాలావరకూ భవంతులకు, ఆసుపత్రుల్లో అగ్నిమాపక వస్తువులు కూడా ఉండడం లేదు. ఏదో అగ్నిమాపక వారోత్సవాల సమయంలో అధికారులు తూతూ మంత్రంగా అవగాహన కల్పిస్తున్నారే తప్ప వారిపై చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలో జరిగిన ఘటన.. (ఫైల్‌ఫొటో)

తీవ్రమైన ప్రమాద సంఘటనలు..

ఏలూరు జిల్లా ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలోని ఫోరస్ (పారాసిట్మల్ కెమికల్ పౌడర్ తయారీ) కంపెనీలో అర్ధరాత్రి సమయంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. యూనిట్-4లో రియాక్టర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 12 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఫ్యాక్టరీలో సుమారు వెయ్యి మంది కార్మికులు మూడు షిఫ్టుల్లో ఎనిమిది గంటల చొప్పున పనిచేస్తున్నారు. ఆఖరిదైన మూడో షిఫ్టు రాత్రి పది గంటలకు ప్రారంభమైంది. ఈ షిఫ్టులో మొత్తం 150 మంది కార్మికులు విధులకు హాజరయ్యారు. మొత్తం నాలుగు బ్లాకుల్లో వీరంతా పనిచేస్తున్న సమయంలో నాలుగో బ్లాకులోని రియాక్టర్ ఒక్కసారిగా పేలింది. దీంతో ఆ సమయంలో అక్కడ మొత్తం 18 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో ఐదుగురు అక్కడికక్కడే సజీవదహనమయ్యారు.

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం శివారు పెంటపాడు సమీపంలోని ఫుడ్ ఫ్యాక్టరీలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఫుడ్ ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం కారణంగా ఒక్కసారిగా ఎగసిపడ్డాయి. ఆయిల్‌లో మిక్స్‌చేసే కెమికల్ సాల్వెంట్ అయిల్ తయారీ కేంద్రంలో ఒక్కసారిగా బాయిలర్ పేలుడు సంభవించడంతో మంటలు ఎగిసిపడ్డాయి. మంటలు ఎగిసిపడిన సమయంలో అక్కడ ఉన్న ఎనిమిది మంది కార్మికుల్లో జగన్నాథపురానికి చెందిన మల్లి అనే వ్యక్తి సజీవదహనమయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి మంటలు అదుపు చేశారు.

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం గ్రామీణ మండలం కడియద్దలో గుట్టుచప్పుడు కాకుండా అన్నవరం అనే వ్యక్తి నిర్వహిస్తున్న దీపావళి మందుగుండు తయారీ కర్మాగారంలో భారీ పేలుడు సంభవించింది. ఇందులో పనిచేసేందుకు చుట్టుపక్కల గ్రామాలైన ఊనగట్ల, జగ్గన్నపేట, కడియద్దకు చెందిన నిరుపేదలు ప్రాణాలు కోల్పోయారు. రాత్రి సమయంలోకూడా బాణసంచా తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో బాణసంచా మందుగుండు సామగ్రి తీవ్రతకు షెడ్డు గోడలు పగిలిపోయి పూర్తిగా ధ్వంసమైంది. అక్కడ పనిచేస్తున్న కూలీలు చెల్లాచెదురుగా ఎగిరిపడ్డారు. వీరిలో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు క్షతగాత్రులయ్యారు. మృతుల శరీర భాగాలు చుట్టుపక్కల ముక్కలుముక్కలుగా పడ్డాయి. సుమారు కిలోమీటరు దూరంలో పడ్డాయంటే పేలుడు ఎంత తీవ్రంగా ఉందో అర్ధమవుతుంది. సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇళ్లుసైతం కంపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. చుట్టుపక్కల ఇళ్ల గోడలు సైతం నెరలు తీశాయి. ఈ ఘటనతో స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం ఉలిక్కిపడ్డారు.

తాడేపల్లిగూడెం శివారులోని ఫుడ్‌ఫ్యాట్స్‌లో జరిగిన ప్రమాదం.. (ఫైల్‌ఫొటో)

రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపిపి సత్యనారాయణ

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని వణుదుర్రులో రూ.10.5 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ సోమవారం వైసిపి నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో రానున్న రోజుల్లో గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. వైఎస్ఆర్ హయాంలో ఇచ్చిన కాలనీలను గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. వైసిపి ప్రభుత్వంలో కాలనీలు అభివృద్ధి జరగడం చాల సంతోషంగా ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఎపి రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గంటా సంధ్య, మోట్రు ఏసుబాబు, ఎంపిటిసి సభ్యులు గుమ్మడి వెంకటేశ్వరరావు, బిసి సెల్ మండల అధ్యక్షులు ఈడే పూర్ణ, పార్టీ గ్రామ అధ్యక్షులు లేళ్ల ఆంజనేయులు, పంచాయతీ కార్యదర్శి జి.రమేష్, ఈడే చందు, ఎ.శివ, సతీష్, సాయి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సిపిఐ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - చింతలపూడి

సిపిఐ 98వ వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని శివపురం గ్రామంలో నిర్వహించిన సభలో సిపిఐ సీనియర్ జిల్లా నాయకులు ఎం.వసంతరావు మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో పార్టీ ఏర్పాటైందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సిపిఐకే ఉందన్నారు. దున్నేవాడికే భూమి కావాలని నిర్ణయించి దేశవ్యాప్తంగా వేలాది ఎకరాలు పేద ప్రజలకు పంచిన ఘనత సిపిఐకి ఉందన్నారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రయివేటు పరం చేస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులు కేంద్రంలో పరిపాలన నడిపిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. శివపురం గ్రామంలో సిపిఐ పతాకాన్ని వెంకట్ ఆవిష్కరించారు. ప్రజానాట్య మండలి కళాకారులు ఎం.అలెగ్జాండర్ విప్లవ గేయాలు ఆలపించారు. ఎండపల్లి గ్రామంలో పి.కేశవరావు, గనిజర్లలో సర్వేశ్వరరావు, రేచర్లలో వెంకటేశ్వరరావు పార్టీ జెండాలు ఆవిష్కరించారు. ఎర్రగుంటపల్లి, పాత చింతలపూడి, రేచర్ల గ్రామాల్లో ఉన్న ప్రతి పార్టీ సభ్యుడు ఇంటిపై ఎర్రజెండాలు ఎగురవేశారు. పార్టీ కార్యాలయం వద్ద జెండాను వసంతరావు, గురవయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, దంతా కృష్ణ, ఎస్‌కె కాలేశా, ముళ్లగిరి నాగేశ్వరరావు, రఘు పాల్గొన్నారు.

29న మాదిగ దినోత్సవం

ప్రజాశక్తి - కుక్కునూరు

ఈ నెల 29వ తేదీన మండలంలోని గణపవరంలో ప్రపంచ ఐదో మాదిగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు ముద్దా పిచ్చయ్య తెలిపారు. సోమవారం కుక్కునూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన మాదిగలకు రాజ్యాంగ పరమైన హక్కులు, రిజర్వేషన్లు అమలు జరగడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని మాదిగల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రపంచ మాదిగ దినోత్సవ కార్యక్రమానికి హోంశాఖ మంత్రి తానేటి వనిత, తాటికొండ ఎంఎల్‌ఎ ఉండవల్లి శ్రీదేవి, ఎంఎల్‌సి అరుణ్‌కుమార్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కుక్కునూరు వైస్ ఎంపిపి రామచంద్రం, మాదిగ దండోరా నాయకులు జి.వెంకటేశ్వర్లు, రవిబాబు పాల్గొన్నారు.

కోచింగ్‌కు విచ్చేసిన అభ్యర్థులు

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల కోచింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్ర అడిషనల్ డిజిపి పివి.సునీల్ కుమార్ నిరుద్యోగ యువతకు ఎస్ఐ, కానిస్టేబుల్ వంటి పోటీ పరీక్షలకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్నారని ఎయిమ్ రాష్ట్ర నాయకులు ఎన్ఎస్.రాజేంద్ర, జిల్లా ఇన్‌ఛార్జి పి.రాంబాబు, నాయకులు కాకర్ల సత్యం అన్నారు. పట్టణంలో సోమవారం ఎఎంసి ఆవరణలో ఎయిమ్ అధ్వర్యంలో ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి లక్ష్యంతో నిరుపేద యువతీ యువకులకు ఎయిమ్ మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఉద్యోగం సాధించాలంటే, లక్ష్యం పట్టుదల ప్రణాళికలు ఉండాలని, ఉద్యోగం సాధించే వరకు పట్టుదలతో ముందుకుసాగాలన్నారు. అభ్యర్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్ మండల కన్వీనర్ బుచ్చిబాబు, గొందిరాజు, పవన్ కుమార్, చోడే అనిల్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరులో సోమవారం టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. కైకలూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు దావు నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్రీను, పంతగాని నాగశ్రీనివాస్, పత్తి శివ, కె.రాము, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'చింతలపూడి ఎత్తిపోతల'ను విస్మరించిన జగన్

ప్రజాశక్తి - చాట్రాయి

చింతలపూడి ఎత్తిపోతలను రాష్ట్ర ప్రభుత్వం పక్కన పెట్టడం అన్యాయమని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నరసింహారావుపాలెంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి పలగాని దుర్గారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'రైతులను దగా చేసిన వైసిపి'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో రైతులను నిలువునా వైసిపి ప్రభుత్వం దగా చేసిందని తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షులు గుత్తా వెంకటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి మోరంపూడి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలుగురైతు ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక ఫైర్‌స్టేషన్ సెంటరు వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యుత్‌శాఖ కార్యాలయం వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ ఎస్ఇ సాల్మన్‌రాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారం చేపట్టిన తర్వాత రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. కనీసం గిట్టుబాటు ధరకూడా రావడం లేదని తెలిపారు. దీనిపై పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పాల జగదీష్‌బాబు, పాలిప్రసాద్, కొమ్మరాజు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ప్రచురించిన 2023 డైరీ, క్యాలెండర్, జిఒ సంపుటాలను ఎంఎల్‌సి షేక్ సాబ్జీ స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా యుటిఎఫ్ ప్రచురిస్తున్న డైరీ, క్యాలెండర్, జిఒ పుస్తకాలు ఉపాధ్యాయులకే కాకుండా ఉద్యోగులు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సాధారణ పనులకు ఆసరాగా, అధికారులకు అవగాహన కల్పిస్తున్నాయన్నారు. రాష్ట్ర కోశాధికారి బి.గోపిమూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్ మాట్లాడుతూ 2023 డైరీ, క్యాలెండర్, జిఒ సంపుటాలు ఉద్యోగుల ఉపాధ్యాయుల ఆదరణ కచ్చితంగా పొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.నరసింహరావు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ఏలూరు జిల్లా కోశాధికారి షేక్ ముస్తఫాలీ, జిల్లా ఆడిట్ సభ్యులు తేరా ప్రసాద్, పశ్చిమగోదావరి జిల్లా సిపిఎస్ కన్వీనర్ కె.రామకృష్ణ ప్రసాద్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

సమస్యల వెలికితీతలో ప్రజాశక్తి కృషి అమోఘం

ప్రజాశక్తి - చింతలపూడి



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న స్టీవెన్ సన్

ప్రజా సమస్యలు వెలుగులోకి తీసుకురావటంలో ప్రజాశక్తి ముందుంటుందని అంతర్జాతీయ ప్రముఖ సువార్త, సంగీత దర్శకులు, గాయకులు, స్టీవెన్ సన్ అన్నారు. ప్రజాశక్తి 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల సమస్యలను నిష్పాక్షపాతంగా అందరికి తెలియజేస్తున్న ప్రజాశక్తి సేవలు అభినందనీయమన్నారు. మండల గ్రంథాలయ ఛైర్మన్ మిర్యాల దిలిప్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మోషే రాజేంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల పరిధిలో ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. మొబైల్ క్యాంపులో ఆధార్ నమోదు, ఆధార్ కార్డులో నవీకరణ, పాఠశాల విద్యార్థులకు ఆధునీకరించిన ఆధార్ కార్డుల జారీ వంటి అంశాలను చేపట్టనున్నామన్నారు. మొబైల్ క్యాంపులో భాగంగా ఈ నెల 27వ తేదీన గుండుగొలను, పూళ్ల గ్రామ పంచాయతీల వద్ద, 28వ తేదీన పూళ్ల సచివాలయం-1 వద్ద, 29వ తేదీన ఆగడాలలంక, పూళ్ల గ్రామ సచివాలయం-2 వద్ద, 30వ తేదీన ఆగడాలలంకతో పాటు, పూళ్ల గ్రామ సచివాలయం-3 వద్ద క్యాంపులు నిర్వహించనున్నామన్నారు. క్యాంపులు నిర్వహించే ఆధార్ యూనిట్ సభ్యులకు సహకరించేందుకు ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు ఇద్దరు వార్డు వాలంటీర్లను, ఇద్దరు గ్రామ సచివాలయ సిబ్బందిని సమకూర్చాలని ఆయన ఆదేశించారు. వీటితోపాటు మొబైల్ ఆధార్ క్యాంపుల విషయమై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, చైతన్య పరిచేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

విశ్వసనీయత లేని సిఎం జగన్

టిడిపి ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్యచౌదరి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో విశ్వసనీయతతో పరిపాలనా సాగిస్తున్నాడని ఆ పార్టీ నాయకులు డప్పు బజాయిస్తున్నారని, కానీ జగన్‌మోహన్‌రెడ్డి ఓ విశ్వాసఘాతకుడు అని టిడిపి రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆరోపించారు. ఏలూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సొంత చెల్లెని కుటుంబానికి దూరం చేయడమా విశ్వసనీయత? సొంత బాబాయిని హత్య చేయించడమా? విశ్వసనీయత అని ప్రశ్నించారు. సంపూర్ణ మద్య పాన నిషేదమంటూ అధికారంలోకి వచ్చిన జగన్ ఆ తర్వాత మాటమార్చి దశలవారీ మద్యపాన నిషేధమని కొత్త పల్లవి ఎత్తుకున్నారని, ఇప్పుడేమో కొత్త మద్యం దుకాణాలకు అనుమతులిస్తూ మహిళలను నిలువునా మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో పనికిమాలిన మద్యం బ్రాండ్లు ఏరులైపారుతున్నాయని తెలిపారు. మత్తు పదార్థాల అమ్మకాల్లో, ఉపాధి కల్పనకు తూట్లు పొడవడంలో, పరిశ్రమల మూతపడడంలో వైసిపి పాలనలో మాత్రం నంబర్ వన్‌గా ఉందని ఎద్దేవా చేశారు. 151 మంది ఎమ్మెల్యేలను ప్రజలు ఇస్తే విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోలేకపోయారని విమర్శించారు. ఆదానీలకు సంపదను మొత్తం దోచిపెడుతున్నారని ఆరోపించారు. పన్నుల భారాన్ని ప్రజలపై మోపి వారిని నిలువునా మోసం చేశారన్నారు. జగన్ అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు నాశనమయ్యాయని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణ (చంటి), మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఉప్పాల జగదీష్‌బాబు, పాలిప్రసాద్ పాల్గొన్నారు.

123వ రోజుకు గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

జగనన్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయని శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని ఆచవరం పరిధిలోని శ్యామలాంబపురం, ఆనందరావు పేట గ్రామాల్లో 123వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆనందరావుపేటలో మాజీ సర్పంచి దండే సైమన్‌రాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణమోహన్, మండల వైసిపి అధ్యక్షులు బత్రాజు శివాజీ, సర్పంచి కోటేశ్వరరావు, మోహన్, ఎంపిడిఒ రామలింగేశ్వరరావు, సిఐ నాగరాజు పాల్గొన్నారు.

దత్తత పిల్లల బాగోగులను తెలుసుకోవాలి

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

దత్తత అందించిన బాలల బాగోగులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ, అడాప్షన్ రెగ్యులేషన్ 2022 ప్రకారం తెలంగాణకు చెందిన దత్తత అర్జీదారులు మంచికంటి శ్రీనివాసరావు, దుర్గ కు ఏలూరు శిశు గృహంలో ఆశ్రయం పొందిన శ్రీధర్ అనే బాబుని జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో సోమవారం కలెక్టర్ అందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ కారా నిబంధనలు అనుసరించి పిల్లలను దత్తత తీసుకునేవారి పూర్వాపరాలను అధికారులు తప్పనిసరిగా పరీక్షించాలన్నారు. దత్తత తీసుకున్నవారు ఆ పిల్లల సంరక్షణను సక్రమంగా చూస్తున్నారా లేదా అనే విషయాన్ని కూడా అధికారులు పరిశీలిస్తూ ఉండాలని, వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్‌లో నమోదు చేస్తూ ఉండాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కారాలో దత్తత ఏ విధంగా పొందాలి అనే విషయాలను పిల్లలు కోరే తల్లిదండ్రులకు తెలియజెప్పే విధంగా రూపొందించిన పోస్టర్లను ప్రతీ గ్రామ/వార్డ్ సచివాలయాల్లో ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి పద్మావతి, జిల్లా శిశు సంరక్షణ అధికారి సూర్యచక్రవేణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - భీమడోలు



పొలసానిపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న సర్పంచి

గ్రామ పంచాయతీల పరిధిలో సమస్యల గుర్తింపు విషయమై గ్రామ వాలంటీర్లు ప్రజలకు, గ్రామపంచాయతీకి మధ్య వారధిగా పని చేయాలని పొలసానిపల్లి గ్రామపంచాయతీ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన కోరారు. గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సర్పంచి వాలంటీర్లతో సోమవారం పంచాయతీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఎంఎల్‌ఎ పుప్పల వాసుబాబు సహాయ సహకారాలతో గ్రామ పరిధిలో విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగా 5 ,6, 7 ,8 వార్డుల్లో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.4.60 లక్షల విలువైన 63 కిలోవాట్ల సామర్థ్యం గల అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు అడ్డంగా ఉన్న కొన్ని సమస్యల పరిష్కరించడం వల్ల గ్రామంలో జగనన్న గృహ నిర్మాణ పథకం వేగంగా కొనసాగుతుందని, దీనిలో భాగంగా సోమవారం కొన్ని ఇళ్లకు శంకుస్థాపన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వాలంటీర్ల దృష్టికి ఏమైనా సమస్యలు వస్తే వాటిని తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ సహాయకులు రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది వెంకటరమణ, పలువురు వాలంటీర్లతో పాటు గ్రామంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో సర్పంచితో పాటు వైసిపి ప్రముఖులు అంబటి నాగేంద్ర ప్రసాద్, చెరుకూరి మధు, సిహెచ్.రవి, కోట బంగారయ్య పాల్గొన్నారు.

పలుచోట్ల వంగవీటి రంగ వర్థంతి సభలు



టి.నరసాపురంలో...

ప్రజాశక్తి - కుక్కునూరు

వంగవీటి మోహన రంగ 34వ వర్థంతి కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో సోమవారం నిర్వహించారు. కాపు యువత ఆధ్వర్యంలో రంగ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాపు యువసేన నాయకులు మాదాసు సత్యనారాయణ, మల్లెల చంటినాయుడు, మంత్రి గోపాలకృష్ణ మాట్లాడుతూ కులమతాలతో సంబంధం లేకుండా అణగారిన బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిలబడిన వ్యక్తి రంగ అని అన్నారు. ఆయన ఆశయ సాధనకు నిరంతరం శ్రమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్, పాదం రాము, పి.వెంకన్న, వీరభద్రం, అనిల్‌కుమార్, వినయ్, ప్రభాకరరావు, శ్రీను, రంగరాజు పాల్గొన్నారు.

గణపవరం : వంగవీటి మోహన్ రంగ కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల వారికి సేవలందించిన వ్యక్తి అని ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల శ్రీనివాసరావు(వాసుబాబు) అన్నారు. మండలంలోని పిప్పర గ్రామంలో ఏర్పాటు చేసిన వంగవీటి మోహన రంగ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోహన్ రంగా అందరివాడని, కుల మతాలకు అతీతంగా ఆయన సేవలందించారని చెప్పారు. అనంతరం గ్రామంలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు దండు రాము, మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు, కాకర శ్యామ్, తోట శ్రీనివాస్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : వంగవీటి మోహనరంగ 34వ వర్థంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని గురజ, ముదినేపల్లి, చేవూరుపాలెం, బొమ్మినంపాడు, నరసన్నపాలెం తదితర గ్రామాల్లో ఉన్న రంగ విగ్రహాలకు వైసిపి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గామిశెట్టి సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు మోట్రు ఏసుబాబు, వైస్ ఎంపిపి రాచూరి రాధా, వైసిపి నాయకులు బొర్రా శేషుబాబు, సాక్షి సాయి, బోయిన రామరాజు, రాచూరి కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, రంగిశెట్టి కొండా, బేతురాజా, గంటా కోటేశ్వరరావు, దాసరి చిరంజీవి, ఎం.శ్రీనివాసరావు, టి.ధనుంజయ్ పాల్గొన్నారు.

మండవల్లి : వంగవీటి మోహనరంగ సంకల్పించిన సామాజిక ఆశయం చాలా గొప్పదని, స్ఫూర్తిదాయకమైందని కైకలూరు ఎంఎల్‌ఎ నాగేశ్వరరావు అన్నారు. స్థానిక సెంటర్‌లో ఉన్న రంగ విగ్రహానికి ఎంఎల్‌ఎతో పాటు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగా ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ బడుగు బలహీన వర్గాలకు అవసరమైన సేవలను చేరువ చేయడమే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు కమ్మిలి విఠల్‌రావు, ఎంపిపి పెద్దిరెడ్డి, రామదుర్గప్రసాద్, కలిదిండి ఎంపిపి ఉమామహేశ్వరరావు, చాపరాల దుర్గాప్రసాద్, సర్పంచి మెండ ఝాన్సీ, గుడివాడ వీరరాఘవయ్య, కొర్లపాడు సర్పంచి యడాలి నాగేశ్వరరావు, సొసైటీ ప్రెసిడెంట్ బొమ్మనబోయిన గోకర్ణ యాదవ్, చేబోయిన వీర్రాజు, గుడివాడ బాబి పాల్గొన్నారు.

టి.నరసాపురం : వంగవీటి మోహన్ రంగ ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని విగ్రహాల దాత సాధనాల నరసింహారావు అన్నారు. మండలంలో వంగవీటి రంగ 34వ వర్థంతి కార్యక్రమాలు మండల కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని రుద్రకోటరాజుగూడెం, మక్కినవారిగూడెం, గంగినీడుపాలెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో రంగ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నోముల సత్యనారాయణ, ఉప్పల సత్తిబాబు, నోముల రెడ్డియ్య, సింగలూరి సత్యనారాయణ, వేమా నాగేశ్వరరావు, శ్రీను, లేళ్ల సతీష్, బొర్ర సుబ్బారావు, ఆర్.సురేష్ పాల్గొన్నారు.

కైకలూరు రూరల్ : మండలంలోని గ్రామాల్లో వైసిపి, టిడిపి, జనసేన నాయకులు రంగ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఎ జయమంగళ వెంకటరమణ, మాజీ ఎంఎల్‌సి విఠల్‌రావు కైకలూరు గాంధీ బొమ్మ సెంటర్‌లోని రంగ విగ్రహానికి పూల మాల వేసి నివాళు లర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకటకృష్ణ, ఎంపిటిసి సభ్యులు మంగినేని రామకృష్ణ, అద్దంకి శ్రీనివాసరావు, తులసి పూర్ణ, నాగు, రఘు, రాము, అమ్మన్నరాజ పాల్గొన్నారు.

బడేటి బుజ్జికి నివాళి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కీర్తి శేషులు మాజీ ఎమ్మెల్యే బడేటి కోటరామారావు(బుజ్జి) తృతీయ వర్థంతి సందర్భంగా స్థానిక పవర్‌పేటలోని బడేటి క్యాంపు కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. బడేటి బుజ్జి విగ్రహానికి ఆయన కుటుంబ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, సానుభూతిపరులకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, ఏలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణయ్య(చంటి), పాలి ప్రసాద్, ఉప్పాల జగదీష్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

యాదవులకు సముచిత స్థానం దక్కాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

యాదవులకు రాజకీయంగా సముచిత స్థానం దక్కాలంటే జిల్లాలో యాదవ సోదరులకు రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ సీటును రాబోయే ఎన్నికల్లో కేటాయించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక దండమూడి రామలక్ష్మి వశిష్ట కళ్యాణ మండపంలో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏలూరు, దెందులూరు, ఉంగుటూరు, చింతలపూడి, పోలవరం నియోజకవర్గాల యాదవప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. టిడిపి మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో యాదవ సోదరులు టిడిపిని గెలిపించాలని కోరారు. చంద్రబాబు హయాంలోనే యాదవులకు సరైన న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ పరిశీలకులు ముమ్మడి సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, చింతలపూడి నియోజకర్గ యాదవ సంఘం గౌరవ అధ్యక్షులు మానికల సూరిబాబు, పలువురు యాదవ నాయకులు పాల్గొన్నారు.

రథసారథులకు ఎంఎల్‌ఎ దిశానిర్దేశం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



రథసారథులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి రథసారథులు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి క్షుణ్ణంగా వివరించాలని నూజివీడు ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. సోమవారం ఆగిరిపల్లిలోని పొన్నం కళ్యాణ మండపంలో మండలంలో నూతనంగా నియమించిన రథసారథులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జి.అనూష, జెడ్‌పిటిసి సభ్యులు పి.వీరబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు, పార్టీ గ్రామ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, రథసారథులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తాగునీటి సమస్యను పరిష్కరించాలని పలువురు మహిళలు స్పందన కార్యక్రమంలో అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం 15వ వార్డు మహిళలు ఐదు నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నా మంటూ వినతిపత్రం అందించారు. మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ స్పందించడం లేదని వాపోయారు. అధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు మహిళలు బి.ధనలక్ష్మి, తులసి, మౌనిక, గంగాభవాని, భారతి పాల్గొన్నారు.

అలాగే ప్రభుత్వం నిర్వహించే భూ సర్వేలో తమ భూమి విస్తీర్ణం తగ్గిందని పట్టణానికి చెందిన భూపతి దేవ్ స్పందనలో ఫిర్యాదు చేశారు. కొయ్యలగూడెం మండలం సీతంపేటలో ఆర్అండ్‌బి రోడ్డు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని యలమంచి హేమావతి వినతిపత్రం అందించారు. ఈ సమస్యలపై తగిన విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సిఫారసు చేశామని ఆర్‌డిఒ ఝాన్సీరాణి తెలిపారు.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, TANUKU

O.S.535/2020

Between:
Bank of Baroda (Erstwhile vijaya Bank), Tanuku ...Plaintiff
Vs
Metla Narayanarao another ...Defendants

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు: 1.మెట్ల నారాయణరావు, S/o.రామారావు, హిందువు, పురుషుడు, 40 సంIIలు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.
2.తోలేటి పాండురంగారావు, S/o.నరసింహారావు, హిందువు, పురుషుడు, 39 సంIIలు, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. ఏమనగా మీరు ది.28-12-2022 తేదిన ఉదయం 10.30 నిIIలకు మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పైకోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

N.Ravi Shankar
Advocate, Tanuku.

IN THE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, TANUKU

O.S.373/2020

Between:
Bank of Baroda (Erstwhile vijaya Bank), Alamuru ...Plaintiff
Vs
Arepalli Leelavathi another ...Defendants

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు: 1.ఆరేపల్లి లీలావతి, W/o.రాఘవులు, హిందువు, స్త్రీ, కొంతేరు, H/o.అడవిపాలెం, యలమంచిలి మండలం.
2.వేముల సుబ్బలక్ష్మి, W/o.చిరంజీవి, హిందువు, స్త్రీ, పాలకొల్లు.

పై నెంబరు దావా గ్రంథములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీకోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. ఏమనగా మీరు ది.28-12-2022 తేదిన ఉదయం 10.30 నిIIలకు మీరు స్వయముగా గాని, ప్లీడరు ద్వారా గాని పైకోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను అట్లుకాని యెడల మీపై పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.Krishnaji
Advocate, Eluru.

IN THE COURT OF THE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD

O.S. No. 1868 of 2020

Between:-
Union Bank of India [A Govt. of India undertaking] [Formerly] Andhra Bank, Credit Card Division, Koti, Hyderabad, rep.by its Sr.Manager & Authorized Officer.
...Plaintiff
And
Sri.T.Suresh,
...Defendant

To
Sri.T.Suresh, S/o.Ranga Rao, Aged about 35 years, Occ:Contractor, R/o. H.No.2-2-26, L.R.Pet, 3rd Street, Near Ramalayam, Polakol, West Godavari District, A.P-534260.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,06,165-19 ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 06-01-2023.

In case of your failure to attend before the Court on 06-01-2023 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T. Bhagya Raju & Associates,
Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, NirmalRatnaAprts,
Opp: R.S.Brothers, Chandanager,
Gangaram Village, **HYDERABAD**-50.